# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

**Bullet Edition**

ఆదివారం 30 మార్చి 2025 | www.prajaaswaramdaily.com | 2 pm


## కాంతిని పూజించడంలో ఆనందించేవారు భారతీయులు

### బీజేపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం



హైదరాబాద్ : బీజేపీ కార్యాలయంలో సూర్యనారాయణ మూర్తి పంచాంగ శ్రవణం చేశారు. ప్రపంచానికి దిశా నిర్దేశనం చేసే శక్తి భారత దేశానికే ఉందన్నారు. ప్రతి మహిళలో తల్లిని చూడాలనే జ్ఞానం అందరిలో పెరుగుతుందని తెలిపారు. ప్రభలమైన మార్పులు దేశంలో చోటు చేస్కోబోతున్నాయని.. పాడి పంటలతో దేశం, ప్రతి గ్రామం పరిడవిల్లుతుందని చెప్పారు. కాంతిని పూజించడంలో ఆనందించేవారు భారతీయులని.. భారతదేశాన్ని రక్షించే రాజకీయ పక్షం బీజేపీ అని వెల్లడించారు. భారతీయ జనతా పార్టీలో భా అంటే కాంతి అన్నారు.. ప్రపంచ దేశాల్లో పెద్ద పెద్ద ప్రమాదాలు వస్తున్నాయని హెచ్చరించారు. అలాంటి వాటన్నింటిని చెప్పే చిన్న పుస్తకమే పంచాంగమని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం చేసే శక్తి భారత్ కే ఉందన్నారు.. జూలై చివర, ఆగస్టులలో విశేష వర్షాలు కురుస్తాయి వెల్లడించారు. వర్షాలు కురిసి ప్రతి గ్రామం సస్యశ్యామలంగా ఉంటాయని.. కొద్దిపాటి ఇబ్బందులు విద్యార్థులకు వస్తాయన్నారు. జూన్, జులై, నవంబర్, డిసెంబర్, జనవరి నెలలతో పాటు ఫిబ్రవరి 17 వరకు ముహుర్తాలు ఉండవని చెప్పారు. మహిళలకు ఈ ఏడాది బీజేపీ పెద్దపీట వేస్తుందని.. ప్రపంచ దేశాలకు భారత్ దేవాలయం అవుతుందని సూర్యనారాయణ మూర్తి వెల్లడించారు.




## ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్‌దే విజయం

### తెలంగాణ భవన్ లో ఉగాది పంచాంగం..

తెలంగాణ భవన్‌లో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నారు. పంచాంగ శ్రావణ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. తెలంగాణ భవన్ లో పంచాంగ శ్రవణం జరిగింది. ఈశాన్య రాష్ట్రాల్లో భూకంపాలు కనిపిస్తాయి. సంపూర్ణ వర్షాలు పడతాయి. ప్రభుత్వం పాలన చేయడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతాయి. కేంద్రం నుండి వచ్చే సహకారం కూడా తీసుకునే అవకాశం ఉండదు. పత్తి పంటలకు మంచి అవకాశం. ఎర్ర నేలలో వేసే పంటకు మంచి అవకాశం. వస్త్ర పరిశ్రమలు కొత్తగా వెలుస్తాయి అభివృద్ధి బాగుంటుంది.

ప్రభుత్వం ప్రకటించిన పథకాలు నామా మాత్రం గానే ముందుకు వెళ్తాయి. కొన్ని రోజుల తర్వాత పోలీస్ వ్యవస్థకు ఎక్కువ అధికారాలు వచ్చే అవకాశం. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్‌దే విజయం. కాని ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడానికి ముందుకు రాదు. కోర్టులో ప్రభుత్వనికి మొట్టి కాయలు వేస్తారు.. కేసీఆర్‌కి ఈ సంవత్సరం మంచిగా ఉంది. వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటా

## బడ్జెట్ షడ్రుచుల కలయిక



### లక్షలాది మందికి ఉపాధి కల్పించేలా 'ఫ్యూచర్ సిటీ' సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచస్థాయిలో హైదరాబాద్‌కు గుర్తింపు తీసుకురావాలని యత్నిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఆయన... జ్యోతి ప్రజ్వాలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా. ''ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా. భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ షడ్రుచుల కలయికలా ఉంది. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలనేదే ఆయన ఆలోచన. బడ్జెట్‌లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు అధిక నిధులు కేటాయించాం. పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలి. దేశానికి తెలంగాణ ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి యత్నిస్తున్నాం. ఫ్యూచర్ సిటీ.. ప్రజలు నివసించే నగరమే కాదు.. పెట్టుబడుల నగరం. లక్షలాది మందికి ఉపాధి కల్పించేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణం ఉంటుంది. అభివృద్ధి జరుగుతున్నప్పుడు కొన్ని అడ్డంకులు తప్పవు. ఏ విధానానికీ నూటికి నూరు శాతం ఆమోదం ఉండదు.

శ్రీమంతుల మాదిరే పేదలూ సన్నబియ్యం తినాలని ఆకాంక్షిస్తున్నారు. గతేడాది 1.56 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తిని సాధించాం. దేశంలోనే అత్యధికంగా వరి పండించిన రాష్ట్రం తెలంగాణ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంత భారీగా ఉత్పత్తి జరగలేదు. సన్న బియ్యం పండిస్తే బోనస్ కూడా ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 60–65 శాతం మంది సన్నబియ్యం పండిస్తున్నారు'' అని సీఎం రేవంత్ వివరించారు.

### పంచాంగ శ్రవణం

పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. ''రియల్ ఎస్టేట్ రంగం తెలంగాణలో ఈ ఏడాది పరుగులు పెడుతుంది. తెలంగాణ రాష్ట్రం మిథున రాశి, పునర్వసు నక్షత్రంలో ఆవిర్భవించింది. పాలకుల మధ్య పోటీతత్వం పెరుగుతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పాలకులు పోటీపడి పరుగులుపెట్టి పాలిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలు మెచ్చే విధంగా పాలన చేస్తారు. తెలంగాణలో వర్షాలకు ఇబ్బంది లేదు, పంటలు అద్భుతంగా పండుతాయి. ఎర్రరేగడి భూములు, ఎర్రటి ధాన్యాలు మంచి ఫలితాలు ఇస్తాయి. శాంతి భద్రతల విషయంలో నిరంతరం పోలీసులు జాగృతంగా ఉండి పనిచేస్తారు.

### సమృద్ధిగా పాడి పంటలు

రాష్ట్రంలో పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయి. తుపాన్లు, భూకంపాలు అప్పుడప్పుడు పలకరించవచ్చు. ఆర్థిక భారం ఎక్కువగానే ఉంటుంది. ప్రజలకు డబ్బు బాగానే సిద్ధిస్తుంది. ఈ ఏడాది ప్రజలు అత్యంత సంతోషంగా ఉంటారు. రాష్ట్రానికి రావాల్సిన డబ్బు రాకపోవడంతో కొంత ఇబ్బంది ఉంటుంది. పొరుగు రాష్ట్రాలతో నీటి విషయంలో ఇబ్బందులు వస్తాయి.. వాటిని ముఖ్యమంత్రి అధిగమిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది విద్యావ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. విద్య, వైద్యంపై ఎక్కువగా దృష్టి పెడుతుంది. సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుంది. అనుకోని ఇబ్బందుల వల్ల అన్ని కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇవ్వకపోవచ్చు. పాలకులు ప్రజాహిత కార్యక్రమాలకు ప్రజాధనాన్ని వెచ్చిస్తారు. విదేశీ పెట్టుబడులు ఎక్కువగా తెచ్చే ప్రయత్నం చేస్తారు. రాష్ట్ర ఆదాయం బయటకు పోకుండా కాపాడే ప్రయత్నం చేస్తారు. ఈ సంవత్సరం వర్షం బాగా పడుతుంది.. కానీ పంటలు కాపాడుకోవాలి'' అని సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణంలో పేర్కొన్నారు.

## అప్పుడు 'పింక్ వైరస్'.. ఇప్పుడు 'కరప్షన్ వైరస్'


### ప్రధాని మోదీ పాలనలో దేశం ఆర్థిక ప్రగతి

### కేందమంత్రి సంజయ్ పండుగ సందర్భంగా ..

### ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన బండి

హైదరాబాద్ : కాంగ్రెస్ నేతలకు 'కరప్షన్ వైరస్' సోకిందని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల నుంచి పెండింగ్ బిల్లుల వరకు ప్రతి దాంట్లోనూ కమీషన్లు తీసుకోవడం సహజమైపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ అవినీతి వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉగాది సందర్భంగా తెలుగు ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లోని తన నివాసంలో కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం ఆర్థిక ప్రగతిలో దూసుకుపోతోందని, ప్రధాని చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జ్యోతిష్య పండితుల ప్రకారం.. ఈ ఏడాది దొంగతనాలు పెరిగే అవకాశముందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడతారని, కొత్త వ్యాధులు ప్రబలే సూచనలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనను గమనిస్తే ఈ జ్యోతిష్య ఫలితాలు నిజమని అర్థమవుతోందని అన్నారు.

బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో 'పింక్ వైరస్' సోకి ప్రజలు నష్టపోయారని సంజయ్ విమర్శించారు. బీజేపీ చేసిన పోరాటాల వల్ల తెలంగాణ ఈ పింక్ వైరస్ నుంచి విముక్తి పొందిందని పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీని స్వాగతించిన బండి సంజయ్, బియ్యం ఖర్చంతా కేంద్రమే భరిస్తోందని తెలిపారు. ఒక్క కిలో బియ్యం కోసం రూ. 40 మోడీ సర్కారే చెల్లిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. 10 ఖర్చు చేస్తున్నదని వివరించారు. ఈ నేపథ్యంలో అన్ని రేషన్ షాపుల్లో ప్రధాని మోడీ ఫోటోలు పెట్టాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీకి తెలంగాణ అంతటా పోటీ చేసే దమ్మే లేదని విమర్శించారు.



## గవర్నర్‌తో కీలక భేటీ



హైదరాబాద్ : ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురు చూస్తున్న మంత్రి వర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్టు తెలుస్తోంది. ఉగాది పండగ వేళ విస్తరణ దిశగా మరో ముందడుగు పడనుంది. ఈరోజు తెలంగాణ గవర్నర్ ను జిష్ణు దేవ్ వర్మను సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవ తేదీని తెలియజేయడంతోపాటు లాంఛనంగా కొత్త మంత్రుల లిస్ట్ ని గవర్నర్ కి అందిస్తారని సమాచారం.

రవీంద్రభారతిలో ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, అనంతరం గవర్నర్ తో భేటీ అయ్యారు. అయితే ఈ భేటీలో కొత్త మంత్రుల పేర్లు కూడా చర్చకు వస్తాయా, లేక కేవలం ముహూర్తం గురించి మాత్రమే చర్చిస్తారా అనేది తేలాల్సి ఉంది. ప్రస్తుతానికయితే నలుగురు ఆశావహుల పేర్లు బలంగా వినపడుతున్నాయి. వివేక్ వెంకటస్వామి, సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వాకిటి శ్రీహరికి మంత్రి వర్గంలో ఛాన్స్ లభిస్తుందని అంటున్నారు. వీరితోపాటు మరికొందరి పేర్లు కూడా ప్రచారంలో ఉండటం గమనార్హం.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసే సమయంలో కూడా మంత్రి వర్గ కూర్పు విషయంలో పెద్ద కసరత్తే జరిగింది. సీఎం, డిప్యూటీ సీఎం పోస్ట్ లతోపాటు మంత్రి పదవుల కేటాయింపులో అధిష్టానం ఆచితూచి నిర్ణయం తీసుకుంది. సీనియర్లకు అవకాశం ఇస్తూనే పార్టీకోసం పనిచేసిన వారికి పదవులు అప్పజెప్పారు. తాజా విస్తరణలో కొత్తవారికి పదవులివ్వడంతోపాటు, పాతవారి శాఖల్లో మార్పులు కూడా ఉండే అవకాశం ఉంది.


3న విస్తరణ

మంత్రి వర్గ విస్తరణ ముహూర్తం దాదాపుగా ఖరారైనట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 3న కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందని అంటున్నారు. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. ఈరోజు సీఎం, గవర్నర్ భేటీ తర్వాత మంత్రి వర్గ విస్తరణ తేదీపై మరింత క్లారిటీ వస్తుంది. సీఎం, గవర్నర్ భేటీ కేవలం ఉగాది సందర్భంగా లాంఛనంగా జరుగుతుందా, లేక మంత్రి వర్గ విస్తరణపై చర్చలు జరుగుతాయా అనేది కూడా వేచి చూడాలి.

## మయన్మార్‌లో మళ్లీ భూకంపం

మయన్మార్ :మయన్మార్‌లో మళ్లీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.1 తీవ్రత నమోదైంది. దీంతో ఇళ్ల నుంచి ప్రజలు భయంతో బయటికి పరుగులు తీశారు. శుక్రవారం మయన్మార్‌లో 7.7 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 1600 మందికిపైగా మృతి చెందారు. 3,400 మందికి పైగా అదృశ్యమయ్యారు. భవనాలు పేకమేడల్లా కుప్పకూలడంతో పాటు రహదారులు బీటలు వారాయి.

## మెక్సికోలో ప్రభాస్ 'స్పిరిట్'.. షూటింగ్



సినిమా: , ప్రభాస్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా కాంబోలో వస్తున్న.. సినిమా 'స్పిరిట్' . ఈ మూవీ ప్రకటన వెలువడిన క్షణం నుంచే అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. యూఎస్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు షూటింగ్ అప్‌డేట్ పంచుకున్నారు. చిత్రీకరణ కోసం మెక్సికోలో కొన్ని ప్రాంతాలు పరిశీలిస్తున్నామని, అక్కడే షూటింగ్ ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రభాస్ ఇప్పటికే 'ది రాజాసాబ్'తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. 'సలార్', 'కల్కి' సీక్వెల్స్ చేయాల్సి ఉంది. వీటికంటే ముందు ఆయన 'కన్నప్ప'తో ప్రేక్షకులను పలకరించనున్నారు. మంచు విష్ణు హీరోగా తెరకెక్కిన ఈ సినిమాలో ప్రభాస్ కీలక పాత్ర పోషించారు. ఏప్రిల్ 25న విడుదల కావాల్సిన సినిమా వాయిదా పడింది.